



న్యాచురల్ ఫిట్‌నెస్ మీట్‌లో ప్రదర్శన ఇస్తున్న అథ్లెట్లు

నేటి నుంచి బాడీబిల్డింగ్ పోటీలు

శంషాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్‌లోని క్లాసిక్ కన్వెన్షన్‌లో ఈ నెల 23, 24 తేదీల్లో రెండు రోజుల పాటు బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు ఐసీఎస్ ఇండియా, ఐసీఎస్ యూఏఈ డెక్కన్ అధ్యక్షుడు అఫ్రైజిం, నిర్వాహకులు జే.ఆచార్యలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం క్లాసిక్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పోటీల్లో 400 మందికి పైగా అథ్లెట్లు దేశ విదేశాల నుంచి హాజరవుతారని చెప్పారు. ఈరెండు రోజుల యాక్షన్ ప్యాక్ ఈవెంట్‌కు వెల్‌వర్స్‌డ్ ప్రజెంటింగ్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రత్యేక ఆకర్షణగా నేచురల్ పిట్‌నెస్‌కు మద్దతు ఇస్తూ టాలీ హుడ్ హీరో అల్లు శిరీష్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ పోటీలకు ఐసీఎస్ ఇండియా చానల్స్ ద్వార రిజిస్ట్రేషన్ చేసిన నేచ్‌రల్ అథ్లెట్లకే అనుమతి ఉందని తెలిపారు.

పౌష్టికాహారం అందించాలి

మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్ 6

షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌కు గోల్డ్‌మెడల్

వివరాలు 6వ పేజీలో...

పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా భౌ.. భౌ అరుపులే వినిపిస్తున్నాయి. ఏ వీధికెళ్లినా గ్రామసింహాల గుంపులు కనిపిస్తున్నాయి. అడుగు ముందుకు వేస్తే అరుస్తున్నాయ్.. కరుస్తున్నాయ్. జిల్లాలో నిత్యం కుక్కకాటుకు గురై అనేక మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. పంచాయతీ, పురపాలక యంత్రాంగం కుక్కల బెడద తొలగించడానికి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా వీధుల్లో శునకాలు కనిపిస్తే పరుగులు పెట్టే పరిస్థితి నెలకొంది.



బాబోయ్..

భౌ భౌ!

పిక్కలు పీకేస్తున్న వీధి కుక్కలు

అరిచేస్తున్నాయ్.. కరిచేస్తున్నాయ్

ఎక్కడ చూసినా గుంపులుగా సంచారం

పట్టణాలు, గ్రామాల్లో హడలెత్తుతున్న జనం

జిల్లాలో పెరుగుతున్న కుక్కకాటు బాధితులు

మూడేళ్లలో 16,190 మందికి గాయాలు



రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వీదుల్లో కుక్కలను చూస్తే జనం భయపడి పోతున్నారు. కొన్ని కాలనీల్లో తిరగడానికి జనం జంకుతున్నారు. ఇళ్లనుంచి అడుగుతీసి బయట పెట్టడానికి చిన్న పిల్లలు, వృద్ధులు వణికిపోతున్నారు. ఏ వీధిలో చూసినా పాతికకు తక్కువ కాకుండా శునకాల గుంపులు కనిపిస్తున్నాయి. ఇటీవల కుక్కకాటు కేసులు విపరీతంగా పెరిగిపోయాయి. బయట తిరిగే కుక్కల్లో ఏది మంచిదో.. ఏది వ్యాధి సోకినదో తెలియని పరిస్థితి ఉంది. నడిచి వెళ్లినా, ద్విచక్రవాహనాల మీద పోతున్నా వెంటాడి పిక్కలు పీకేస్తున్నాయి. బెదిరించినా ఎగబడి మరీ కరుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో నిత్యం ఏదో ఒక గ్రామంలో శునకాల దాడులు జరుగుతుండగా.. పిల్లలు, పెద్దలు.. చివరకు మూగజీవాలు కూడా గాయాలపాలవుతున్నాయి. రాత్రి వేళలో కుక్కల ఏడుపుకు జనాలకు నిద్రలేకుండా పోతుంది. కరిచినప్పుడు సకాలంలో వైద్యం అందించపోతే రేబిస్ వ్యాధిన బారిన పడి ప్రాణాలే పోయే పరిస్థితి ఏర్పడుతుంది.

16,190 కుక్క కాటు కేసులు..

రంగారెడ్డి జిల్లాలో గడిచిన మూడేళ్లలో 16,190 మంది కుక్క కాటుకు గురైనట్లు అధికారికంగా లెక్కలు

మిగతా 8వ పేజీలో...

రంగారెడ్డి జిల్లాలో నమోదైన కుక్క కాటు కేసులు

	2023	2024	2025	మొత్తం
కేసుల సంఖ్య	5,747	3,998	6,445	16,190
యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్	5,800	4,022	6,550	16,372

సబ్బుతో శుభ్రం చేసుకోవాలి

కుక్క కరిచిన వెంటనే గాయమైన చోట నీటి ధార పోస్తూ సబ్బుతో శుభ్రపరుచుకోవాలి. వైద్యుల సూచనల మేరకు వెంటనే టీకాలు తీసుకోవాలి. గాయం కాగానే వస్త్రం చుడితే రేబిస్ వ్యాధి బారిన పడి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది. కుక్క కాటు వేయగానే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలి. యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ వేయించుకోవాలి.

- రాకేష్, డీఎంవో



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్/యాచారం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 27 వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై సెప్టెంబర్ 6న నిమజ్జనంతో ముగియనున్నాయని, ఈ నేపథ్యంలో భక్తులు, నిర్వాహకులు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించాలన్నారు. నిమజ్జనానికి జిల్లాలో 44 చెరువులను గుర్తించినట్లు తెలిపారు. శోభాయాత్ర నిర్వహించే దారిలో ఉన్న గుంతలకు మరమ్మతులు చేయాలన్నారు. నిమజ్జనం చేసే ప్రదేశాల్లో క్రేన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఫాగింగ్, సానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలు వేలాడకుండా చూడాలన్నారు. చెరువుల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, మహేశ్వరం డీసీపి సునీతారెడ్డి, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, శంషాబాద్ అడిషనల్ డీసీపీ కె. రామ్ కుమార్, మాదాపూర్ అడిషనల్ డీసీపీ సాయిరామ్, ఆర్డీవోలు అనంత రెడ్డి, చంద్రకళ, సరిత, జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, ఆర్‌అండ్‌బి అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఈనెల 25 నుంచి జ్వరాలపై ఇంటింటి సర్వే చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శానిటేషన్ నిర్వహణను నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించారు. దోమలు వ్యాప్తి చెందకుండా నీరు నిలిచిన చోట ఆయిల్‌బాల్స్‌ను వేయాలన్నారు. వాటర్‌ట్యాంకులను ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేయాలని ఆదేశించారు. వైద్యసిబ్బంది క్యాంపులు పెట్టి డెంగీ, మలేరియా ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, డీఆర్‌వో సంగీత ఉన్నారు.

షాద్‌నగర్ డివిజన్‌లో తహసీల్దార్ల బదిలీలు

షాద్‌నగర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూఖ్‌నగర్, నందిగామ, కొందుర్గు మూడు మండలాల తహసీల్దార్‌లను బదిలీ చేస్తూ శుక్రవారం సాయంత్రం కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఫరూఖ్‌నగర్ తహసీల్దార్‌గా ఉన్న పార్థసారధి కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా, నందిగామ తహసీల్దార్ రాజేశ్వర్‌ను కలెక్టరేట్‌లోని యస్‌డీసీ, యూఎల్‌సీ విభాగంలో సూపరింటెండెంట్‌గా, కొందుర్గు తహసీల్దార్ ఉన్న రమేష్‌ను తలకొండపల్లి తహసీల్దార్‌గా ప్రభుత్వం నియమించింది. షాద్‌నగర్ డివిజన్ పరిధిలో సుదీర్ఘకాలంగా తహసీల్దార్‌లుగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే వీరికి స్థానచలనం కల్పించినట్లు సమాచారం.



ఆలూర్ గ్రామంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

మహిళల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట

వారి ఆర్థిక ప్రోత్సాహకానికి ముద్రలోన్స్..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 33 శాతం అవకాశం

నారీశక్తితోనే రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఖాయం

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

చేవెళ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళలు నారీశక్తిగా ఎదగాలనే సంకల్పంతో మోదీ ప్రభుత్వం ముద్రలోన్స్ అందిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం చేవెళ్ల మండలంలోని ఆలూర్ గ్రామంలో మహిళా సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ స్టాండ్ అఫ్ ఇండియా ద్వారా సబ్సిడీపై

మిగతా 8వ పేజీలో...

దళిత కుటుంబ సభ్యులతో కలిసి టిఫిన్

పల్లె పల్లెకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో దళితుడు సత్తయ్య ఇంట్లో గురువారం రాత్రి బస చేయగా, శుక్రవారం ఉదయం అక్కడే స్నానం చేసిన తర్వాత గ్రామంలో ఉన్న శివాలయాన్ని రాంచందర్‌రావు సందర్శించారు. అనంతరం వంశీ వారి ఇంట్లోనే వారితో కలిసి అల్పాహారంగా ఉప్మాతో పాటు జొన్నరొట్టె తీసుకున్నారు. అయితే ఆలూర్ గ్రామంలో పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమాన్ని ముగించారు.

చేపల పెంపకానికి ప్రోత్సాహం

» కేంద్ర ఫిషర్స్ శాఖ మంత్రి సింగ్‌భగీరథ్



చేపలను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

కందుకూరు, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): చేపల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తామని కేంద్ర ఫిషర్స్ శాఖ మంత్రి సింగ్‌భగీరథ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో కందుకూరు మండలం గూడూరు గేటు వద్ద నర్ర రవికుమార్ ఏర్పాటు చేసిన చేపలపెంపకం కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఏర్పాటు చేసిన చేపలతో లాభాలు ఎలా ఉన్నాయని నిర్వాహకుడిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, రాష్ట్ర కిసాన్‌మోర్చా నాయకులు పల్లె కృష్ణగౌడ్, మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, బండి నర్సింహ్మా, ఎస్.భూమిరెడ్డి పాల్గొన్నారు.



యూరియా తిప్పలు

కందుకూరు, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మండల పరిధి రైతులు యురియా కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది. సుమారు 500టన్నుల యురియా కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 120 టన్నులు మాత్రమే సరఫరా చేశారు. శుక్రవారం 420బస్తాల యురియా మాత్రమే రావడంతో మండల సహకార సంఘం కార్యాలయం వద్ద రైతులు గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చింది. అయినప్పటికీ సరిపడా యురియా బస్తాలు ఇవ్వలేవదని రైతులు వాపోయారు.



ఆమనగల్లులో బంద్‌తో మూత బడ్డ దుకాణాలు

మార్వాడీ గో బ్యాక్ బంద్ ప్రశాంతం

స్వచ్ఛందంగా స్థానిక వ్యాపార దుకాణాల మూసివేత

ఆమనగల్లు/కడ్తాల్/చౌదరిగూడ/ కొందుర్గు/ ఇబ్రహీంపట్నం/కందుకూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మార్వాడీ వ్యాపారులకు వ్యతిరేకంగా ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ ఇచ్చిన మార్వాడీ గో బ్యాక్ బంద్ ఆమనగల్లు పట్టణంలో విజయవంతమైంది. బంద్ సంపూర్ణంగా జరిగింది. వర్తక సంఘం, కిరాణా, వస్త్ర, స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో బంద్ పాటించారు. మార్వాడీ వ్యాపారస్థులు గో బ్యాక్ అంటూ స్థానిక వ్యాపారులు ఈనెల 18న ఆమనగల్లు బంద్‌కు ఇచ్చిన పిలుపు రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు తెర లేపింది. దీంతో ఇంటలిజెన్స్ అధికారులు, పోలీసులు ఉన్నతాదికారులు స్పందించి రంగంలోకి దిగడం, స్థానిక వ్యాపారులు, మార్వాడీ వ్యాపారులకు జరిగిన చర్చలు సఫలీకృతం కావడంతో బంద్ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ఆమనగల్లులో మార్వాడీ సమాజంపై విద్వేష ప్రసంగాలు, రెచ్చగొట్టే ఘటనలపై చర్యలు తీసుకోవాలని డీజీపీ జితేందర్‌ను తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుద్ గుప్త కోరారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తమైంది. రాష్ట్ర వ్యాప్త బంద్ పిలుపు నేపథ్యంలో ఎస్‌ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ర్యాలీ, ధర్నాకు అనుమతి నిరాకరించారు. దీంతో కొందరు వ్యాపారులు దుకాణాల ఎదుట నిలుచొని నిరసన తెలిపారు. మార్వాడీ దుకాణాల వద్ద నిఘా ఏర్పాటు చేశారు. కడ్తాల మండల కేంద్రంలో వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. దుకాణాలను

మిగతా 8వ పేజీలో...



మహాధర్నా పోస్టర్‌ను విడుదల చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

పీఆర్‌టీయూ మహాధర్నాకు తరలిరండి

» జిల్లా అధ్యక్షుడు సాము మహేందర్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద సెప్టెంబర్ 1న తలపెట్టిన మహాధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సాము మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనే లక్ష్యంగా నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం షాద్‌నగర్ కుంటబడితో పాటు వెలిజర్ల, బూర్గుల ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులను కలిసి మహాధర్నా ప్రాధాన్యతను వివరించారు. అలాగే పీఆర్‌టీయూ సభ్యత్వాలను నమోదు చేయించారు. కార్యక్రమంలో నాయకులు కొనగారి కృష్ణారెడ్డి, ఎనుముల శ్రీధర్ రెడ్డి, బివిఎం రాజు, రాఘవేందర్, సురేష్‌సింగ్, నందిగామా సురేష్, జనార్ధన్ రెడ్డి, డి. వెంకటేష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పనుల జాతర

» ఊరూరా భూమి పూజలు, ప్రారంభోత్సవాలు

» హాజరైన ఎమ్మెల్యేలు, అధికారులు



రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనుల జాతర విజయవంతంగా ముగిసింది. ఊరూరా వివిధ అభివృద్ధి పనులకు, భూమి పూజలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. 1,212 పనులకు రూ.15.04 కోట్ల నిధులతో పనులకు ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవాలు, భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, షాద్‌నగర్ నియోజకవర్గంలో

మిగతా 8వ పేజీలో...

చేపట్టిన పనులు వివరాలు

పని పేరు	సంఖ్య	రూ.లక్షల్లో
పశువుల కొట్టాలు	367	336.00
గొర్రెల షెడ్స్	14	12.81
అజోలా పిట్స్	10	5.56
చెక్‌డ్యామ్‌లు	55	12.58
నాపెడ్ నిర్మాణాలు	10	50.00
కమ్యూనిటీ సోక్‌పిట్‌లు	193	31.05
అంగన్‌వాడీ భవనాలు	468	92.94
పంచాయతీ భవనాలు	38	456.00
స్కూల్ టాయిలెట్లు	21	42.00
కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు	15	45.00

ఫాంహౌస్‌పై పోలీసుల దాడి

వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

మొయినాబాద్, 22ఆగస్టు(ఆంధ్రజ్యోతి): వ్యభిచారం జరుగుతుందనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఫాంహౌస్‌పై దాడులు నిర్వహించారు. ఇందులో ఓ మహిళ నలుగురు పురుషులు పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ పీఎస్ పరిధిలోని కాశీబౌలిలో ఉన్న కృష్ణారెడ్డి ఫాంహౌస్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్ఎస్‌వోటీ పోలీసులు మొయినాబాద్ పోలీసులతోకలిసి దాడి చేశారు. పట్టుబడ్డ వారిని ప్రశ్నించిగా కనకమామిడికి చెందిన శ్రీనివాస్ అలియాస్ బోండల శ్రీను తండ్రి సత్యానారయణ టిఫిన్ సెంటర్ నడుపుతున్నాడు. ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో పేదింటి అమ్మాయిలకు డబ్బుల ఆశ చూపి ఇక్కడికి తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అతడు గతంలోనూ పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.

కళాశాల భవనాన్ని పూర్తి చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల రిలే నిరాహార దీక్షలు


ఆమనగల్లులో రిలే నిరాహార దీక్షలో విద్యార్థులు, నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం జూనియర్ కళాశాల ఎదుట హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రముఖ సంఘ సేవకుడు, జేఏసీ నాయకుడు పాపిశెట్టి రాము ఎస్ఎఫ్ఐ నాయకులకు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. భూ వివాదాన్ని పరిష్కరించి కళాశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. 2001లో ఆమనగల్లుకు జూనియర్ కళాశాల మంజూరైందని, 24 ఏళ్లుగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అసౌకర్యాల మధ్య కళాశాల కొనసాగుతుందని ఆరోపించారు. భవన నిర్మాణం గురించి అనేకసార్లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినా, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి విన్నవించినా స్పందన లేదన్నారు. వెంటనే కళాశాల భవన నిర్మాణం చేపట్టకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, నాయకులు పూల శ్రీను, కురిమిద్ద శివ, వినోద్, కిరణ్, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

తల్లి మృతిచెందిన వారంలోనే..

రోడ్డు ప్రమాదంలో కొడుకు దుర్మరణం

మొయినాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తల్లి మృతిచెందిన దినవారం రోజే జరిగిన రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి చెందాడు. ఈ ఘటన మొయినాబాద్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కమ్మరి వెంకటేశ్‌చారి(50) గురువారం రాత్రి బైక్‌పై కుమారునితో కలిసి కేతిరెడ్డిపల్లి నుంచి లంగర్ హౌస్ వెళ్తున్నాడు. మొయినాబాద్ సమీపంలోని తాజ్ హోటల్ వద్ద హైదరాబాద్ - బీజాపూర్ రహదారిపై వెనకాల నుంచి వేగంగా వస్తున్న క్రేన్ వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్‌చారికి తీవ్రగాయాలు కాగా, కుమారునికి సల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు వెంకటేశ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.


వెంకటేష్‌చారి (ఫైల్)

అయితే వెంకటేశ్‌చారి బండ్లగూడ సమీపంలోని కాలిమందిర్ వద్ద నివాసం ఉంటున్నాడు. ఆయన తల్లి కమ్మరి సత్తమ్మ వారం క్రితం ప్రమాదవశాత్తు నీటి కాల్వలో పడి మృతి చెందింది. గురువారం జరిగిన దినవారం కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. రాత్రి ఇక్కడే ఉంటే ప్రమాదం జరిగి ఉండక పోయేదని బంధువులు పేర్కొన్నారు. వారం రోజుల్లోనే ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడం బాధాకరం. వెంకటేశ్ భార్య కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందింది. కూతురికి వివాహంకాగా కుమారుడు ఉన్నాడు. మృతుడి అన్న శేఖర్‌చారి ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన జాతీయ సదస్సు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యా సంస్థల్లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ట్రిపుల్‌ఈ) విభాగం ఆధ్వర్యంలో అత్యాధునిక విద్యుత్ వాహన సాంకేతికత కోసం క్వాంటమ్ ఆర్టీఫిషియల్ ఇంటలిజెన్స్ అప్లికేషన్స్ అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. సాంకేతిక విద్యలో ప్రాతీయ బాషల సమన్వయాన్ని ప్రోత్సహించడంతోపాటు భవిష్యత్తులో ఇంజినీరింగ్ ఆవిష్కరణలో సాంకేతికతలపై దృష్టి సారించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని కార్యక్రమ కన్వీనర్ వై.వీ.బలరామ కృష్ణారావు అన్నారు. ఐఐటీ, ఎన్ఐటీల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యావేత్తలు ఈ సదస్సులో పాల్గొని అభిప్రాయాలను వల్లడించారన్నారు. ఈ సదస్సులో టెక్నికరల్ సెషన్లు, ప్యానల్ చర్చలు, పేపర్ ప్రజంటేషన్లు ఇచ్చారు. కార్యక్రమంలో సదస్సు కో కన్వీనర్ ఎస్.రాజేందర్‌రెడ్డి, గురునానక్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ జీ.ఎస్.కోహ్లీ, ఎండీ డా.హెచ్ఎస్ సైనీ, డైరెక్టర్ డా.ఎస్.శ్రీనాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ పి.పార్థసారథి, ఆర్‌అండ్‌డీ డీన్ డా.ఎస్.వీ.రంగనాయకులు పాల్గొన్నారు.


సదస్సులో అతిథులు, ట్రిపుల్‌ఈ విభాగం అధికారులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నుంచి ఉత్సవాలు ముగిసి నిమజ్జనం అయ్యేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కీసర ఆర్డీఓ వెంకటఉపేందర్‌రెడ్డి అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మున్సిపల్, పోలీస్, విద్యుత్, మత్స్య, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమజ్జనం రోజు పోలీసులు, స్థానిక మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఫిలిం సిటీ ఆక్రమణను తొలగించాలి

యాచారం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఫిలింసిటీ ఆక్రమించిన వేముల కత్వ, ఇందిరాసాగర్, పటేల్‌కుంటలలో ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి బారీ గోడ కట్టారని, నిర్మాణాలను తొలగించి ఫిలింసిటీ యాజమాన్యం కింద ఉన్న ప్రభుత్వ భూములను రక్షించాలని అబ్దుల్లాపూర్‌మెట్ సీపీఎం నాయకులు నర్సింహ, రాములు తదితరులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. 307 సర్వే నంబర్‌లో అరవై ఎకరాలుండగా, అందులో 20 ఎకరాలు ఉషోదయ ఎంటర్‌ప్రైజేస్ పేరున ఉందన్నారు. పటేల్‌కుంట ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌లో ఫిలింసిటీ ప్రధాన గేటు వరకు రోడ్డు వేసి ఆక్రమించారని ఆరోపించారు. 301 సర్వే నంబర్‌లోని ఆరెకరాల్లో అనాజ్‌పూర్‌లోని ఎస్సీ రైతులకు పట్టాలిచ్చారని, ఈ భూమి ఫిలింసిటీ గేటు లోపల ఉండడంతో రైతులను రాకుండా అడ్డుకుంటున్నారని, కోర్టు ఆర్డర్ అడ్డుపెట్టుకొని వారి ఆదీనంలో పెట్టుకున్నారన్నారు. 251 సర్వే నంబర్‌లో పదెకరాలు ఆక్రమించారన్నారు. ప్రభుత్వ భూములను సర్వే చేసి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ విషయం ఇరిగేషన్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

శంకర్‌పల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందడంలేదని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్ ఆరోపించారు. శంకర్‌పల్లి మండలంలోని ప్రొద్దటూరు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో సరిపోను మరుగుదొడ్లు లేవని, ప్లేగ్రౌండ్‌లో చిన్నపాటి వర్షానికి నీళ్లు నిలుస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు సరిపోను ఉపాధ్యాయులు ఉన్నా ఎంఈవో అక్బర్ ఇష్టానుసారంగా డిప్యుటేషన్ వేశారని మండిపడ్డారు.

షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌కు గోల్డ్ మెడల్

షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుకు బంగారు పథకంతోపాటు నగదు, ప్రశంసాపత్రం అందించారు. రాజా బహదూర్ వెంకట్‌రాంరెడ్డి ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ చేతులమీదుగా బంగారు పథకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ వెంకటేశ్వర్లును అభినందించారు. తన సేవలను గుర్తించి పతకాన్ని అందించినందుకు సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి, శంషాబాద్ డీసీపీ రాజేష్, షాద్‌నగర్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

ఆదిభట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొంగ్లూర్ ఎక్స్ రోడ్డులో మాతాజీ కిరాణా జనరల్ స్టోర్‌లో విక్రయిస్తున్న గుట్కా ప్యాకెట్లను మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన బోలారం కుమావత్(43) బొంగ్లూర్ ఎక్స్ రోడ్డులో కిరాణా స్టోర్ నడుపుతూ అక్కడే ఉంటున్నాడు. అక్రమంగా గుట్కాలు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో శుక్రవారం దాడులు చేసి, విక్రయానికి సిద్ధంగా ఉంచిన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని ఆదిభట్ల పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవి కుమార్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

డీజే పెడితే కేసులు నమోదు చేస్తాం

యాచారం/కడ్తాల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా డీజే వాడితే చట్టపరంగా చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలో గణేష్ నవరాత్రోత్సవాల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అక్రమంగా విద్యుత్ కనెక్షన్ పెట్టవద్దని నిర్వాహకులకు సూచించారు. వినాయక చవితి నుంచి విగ్రహ నిమజ్జనం వరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో సీఐ సత్యనారాయణ, ఎస్సైలు సైదులు, వంశీ, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

శాంతియుతంగా జరుపుకోవాలి

గణేశ్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ కోరారు. కడ్తాల మండల కేంద్రంలోని టీబీఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం గణేశ్ నవరాత్రోత్సవాల నేపథ్యంలో శాంతి సమావేశం నిర్వహించారు. వినాయక మండపాల ఏర్పాటు, అనుమతి, మండపాల నిర్వాహణ, ఉత్సవాల ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. గణేశ్ నవరాత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలన్నారు. సీఐ గంగాధర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఏఈ నరేందర్, ఇరిగేషన్ శాఖ ఏఈ మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహా రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఏటీసీ నమూనాను పరిశీలిస్తున్న అధికారులు

రూ.7 కోట్లతో ఏటీసీ నిర్మాణం

దుద్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని హకీంపేట్‌కు మంజూరైన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) నిర్మాణానికి అధికారులు శుక్రవారం తుది నమూనాను ఖరారు చేశారు. గ్రామ శివారులోని సర్వే నం.252లో ఎకరా స్థలాన్ని కేటాయించడంతో గత నెలలో టీజీఐఐసీ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఏటీసీ నిర్మాణానికి తుది నమూనాను ఇచ్చేందుకు సంబంధిత అధికారులు మరోమారు సందర్శించారు. రూ.7 కోట్లతో త్వరలోనే నిర్మాణం చేపట్టనున్నట్లు టీజీఐఐసీ డీఈ శేషారావు తెలిపారు. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఏఈ సురేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, చాకలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులపై బెంగతో..
పాఠశాల భవనం నుంచి దూకిన బాలిక

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లపటేల్‌గూడ దగ్గర ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల పాఠశాలలో చదివే ఆరో తరగతి విద్యార్థిని పాఠశాల భవనం పైనుంచి దూకడంతో కాలికి గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే ఖైరతాబాద్‌కు చెందిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల పాఠశాల చెర్లపటేల్‌గూడలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతోంది. ఈ పాఠశాలలో గద్వాలకు చెందిన మీనాక్షి(11) ఈ నెల 5న ఆరో తరగతిలో చేరింది. అమ్మానాన్నలపై బెంగతో, ఇక్కడ చదవడం ఇష్టం లేకనో శుక్రవారం మధ్యాహ్నం పాఠశాల భవనం రెండో అంతస్తు నుంచి దూకడంతో ఓ చెట్టు అడ్డు తగిలి కిందకు పడిపోయింది. దీంతో కాలికి గాయం కావడంతో ఆ బాలికను ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. తరువాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాలిక కాలికి గాయమైందని, ఎలాంటి ప్రమాదం లేదని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

కాలుష్యం బారి నుంచి కాపాడండి

షాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందన్‌వెళ్లి పారిశ్రామిక హబ్‌గా మారుతుందని అంతా సంతోషపడ్డారు. పరిశ్రమలతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనుకున్నారు. కానీ, వాయు కాల్యుష్యంతో ముప్పు తిప్పలు పడుతున్నారు. కుందన్ టెక్స్ టైల్స్ కంపెనీ వల్ల వాయు కాల్యుష్యం ఎక్కువగా అవుతుందని చందన్‌వెళ్లి గ్రామస్తులు శుక్రవారం కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ మాట్లాడుతూ.. కుందన్ టెక్స్ టైల్స్ పరిశ్రమ నుంచి వెలువడే వాయు కాలుష్యంతో పిల్లలు, వృద్ధులు శ్వాసకోస సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కంపెనీ నుంచి వస్తున్న కాలుష్యంతో దుర్వాసన వస్తోందని, పరిసరాల్లో నీటిని పశువులు కూడా తాగడం లేదన్నారు. కాలుష్యం కారణంగా పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని ఆరోపించారు. ఇంత జరుగుతున్న పీసీబీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాలుష్య కోరల నుంచి గ్రామస్తులకు విముక్తి కల్పించాలని, కంపెనీపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంటేష్, మల్లేష్, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి

కేశంపేట, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంతాపూర్ అటవీ ప్రాంతంలో స్వయంభుగా వెలిసిన పానకాల లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సమీప గ్రామ ప్రజలు ప్రతి సంవత్సరం స్వామి వారికి పూజలు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలందరిపై స్వామి కృప ఉండాలన్నారు. కార్యక్రమంలో సంతాపూర్, పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్ రెడ్డి, తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు యారంశేఖర్ రెడ్డి, నాగిళ్ల వెంకటేష్, సాజీద్, నరేందర్ రెడ్డి, జగన్ రెడ్డి, యాదయ్య గౌడ్, రజినీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కేశంపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవాలని, వేడుకల వేళ డీజేలకు అనుమతి లేదని కేశంపేట సీఐ నరహరి సూచించారు. మండల కేంద్రంలోని బీఎస్‌వై గార్డెన్‌లో శుక్రవారం శాంతి సమావేశం నిర్వహించారు. గ్రామాలలో గణేశ్ మండపాలు ఏర్పాటు చేసుకునే వారు అనుమతి తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఆజంఅలీ, ఇన్‌చార్జీ ఎంపీడీవో కిష్టయ్య, ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఏఈ సాయి, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గోతులు తీయొద్దు

షాద్‌నగర్ : గణేష్ మండపాల ఏర్పాటు కోసం రోడ్లపై గుంతలు తీస్తే చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీత హెచ్చరించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మండపాల ఏర్పాటు కోసం రోడ్లపై గుంతలు తీయడం, రోడ్డుకు అడ్డంగా వినాయకులను పెట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఆకాశంలో అద్భుతం
సూర్యుడి చుట్టూ వలయాకారం

రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ గ్రామంలో అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. శుక్రవారం ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు సూర్యుడి చుట్టూ వలయాకారం ఏర్పడింది. ఈ అద్భుత దృశ్యం అందరినీ ఆకర్షించింది. కొందరు యువకులు తమ ఫోన్‌లలో బంధించారు.

- యాచారం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి)

గ్రామీణ బ్యాంకులో ఇంటి దొంగలు

- ఫిక్స్‌డ్ చేసిన మహిళకు తెలియకుండా డబ్బులు డ్రా
- ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై కేసులు



తాండూరు,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ తాండూరు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఖాతాదారురాలు ఫిక్స్ డిపాజిట్ చేసిన డబ్బులను వారికి తెలియకుండా ఫోర్జరీ చేసి డ్రా చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే తాండూరుకు చెందిన విశాలక్షి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.6లక్షల విలువ చేసే రెండు ఫిక్స్ డిపాజిట్‌లను 1994లో చేసింది. అయితే ఆమెకు తెలియకుండా బ్యాంకులో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ప్రేమ్‌సింగ్ ఫోర్జరీ సంతకంతో డబ్బులు విత్ డ్రా చేసుకున్నాడు. గతంలో ఫిక్స్‌డ్ చేసిన డబ్బుల కాలపరిమితి ముగియడంతో విత్ డ్రా చేసుకునేందుకు బ్యాంకుకు వచ్చిన విశాలాక్షికి తన డబ్బులు ఎవరో ఫోర్జరీ చేసి విత్ డ్రా చేశారని తెలువడంతో మేనేజర్ శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ప్రధాన నిందితుడిగా ప్రేమ్‌సింగ్‌ను గుర్తించి ఆయనపై కేసు నమోదు చేశారు. ఇంకా ఔట్ సోర్సింగ్ సిబ్బంది కొంత మంది ప్రమేయం ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని విచారణ చేసి వారిపై కూడా కేసు నమోదు చేస్తామని సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. 1994లో బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసిన ఖాతాలను అప్పట్లో కంప్యూటీకరణ చేయలేదు. మ్యాన్యువల్ పత్రాలను ఖాతాదారులకు అందజేశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మొయినాబాద్ రూరల్: చిన్నమంగళారంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్ రూరల్/శంకర్‌పల్లి/షాబాద్/చేవెళ్ల, ఆగస్టు22(ఆంధ్యజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. పల్లెల్లో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చిన్నమంగళారంలో రూ.12 లక్షలతో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ సంధ్య, షాబాద్ దర్శన్, హన్మంత్ యాదవ్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

శంకర్‌పల్లి మండలంలోని మహాలింగపురం గ్రామంలో ఉపాధిహామీ నిధులతో నిర్మించిన కోళ్ల ఫామ్ షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రమోహన్, మండల ప్రత్యేకాధికారి సురేష్‌బాబు, తహసీల్దార్ సురేందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీవో గిరిరాజ్, ఏపీవో నాగభూషణం, పంచాయతీ రాజ్ ఏఈ నందకిషోర్, తదితరులు ఉన్నారు. అలాగే షాబాద్ మండల పరిధిలోని ఆస్పల్లిగూడలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డును జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మండల పరిధిలో రూ.18 కోట్ల 60 లక్షలతో బీటీ రోడ్లు మంజూరయ్యాయన్నారు. ఆయన వెంట గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్, చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని హస్తేపూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి ఎమ్మెల్యే యాదయ్య శంకుస్థాపన చేశారు. ఆయన వెంట రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం రుణమాఫీ చేయదు..
ఎమ్మెల్యే పట్టించుకోడు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ తీరుతో, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి అసమర్థతతో నియోజకవర్గ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆరోపించాడు. శుక్రవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు పంట రుణ మాఫీ చేస్తామని చెప్పి అధికారం చేపట్టి 20 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నియోజకవర్గంలోని 50శాతం మంది రైతులకు రుణ మాఫీ చేయలేదన్నారు. ఒక్క ఘట్‌కేసర్ సహకార సంఘంలోనే 1,189 మంది రైతులకు నేటికీ రుణమాఫీ జరుగలేదన్నారు. ఇక్కడి రైతులకు రూ.8 కోట్ల 88లక్షలను ఆడిట్ పేరుతో ఎగనామం పెట్టారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపిస్తోందని వ్యాఖ్యానించారు. రుణమాఫీపై ఎదులాబాద్‌లో రైతులతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనా దక్షతతో 20 నెలల్లో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటించారు. తలకొండపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు ఎల్‌వోసీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సుకు పాటుపడుతున్న ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గం ప్రగతిలో దూసుకుపోతుందన్నారు. ఆమనగల్లు, కల్వకుర్తి మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చి దిద్దుతామని తెలిపారు. నియోకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో రోడ్లను అభివృద్ధికి కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, నాయకులు తావుర్యనాయక్, విజయ్‌నాయక్, బీష్మాచారి, సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, విజయ్‌రాథోడ్, జగన్, తాళ్ల రవీందర్, సూదిని కొండల్ రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు

- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



పెద్దేముల్: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్/యాలాల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అవసరమైన అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు నిర్మిస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం బండపల్లి, ఇందూరు, సిద్దన్నమడుగుతండాల్లో అంగన్‌వాడీ కేంద్రం, గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు నిర్మించేందుకు నియోజకవర్గానికి రూ.8 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఉపాధిహామీ ద్వారా పశువుల షెడ్లు, ఇంకుడుగుంతలు, కంపోస్ట్ షెడ్లు, కోళ్లఫారాలు, మేకలషెడ్లు మంజూరైన వారికి మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో టాటా కన్సల్టెన్సీ అడ్వాన్స్ ట్రైనింగ్‌సెంటర్(ఏటీసీ) మంజూరైందని, ఇందులో అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి దారాసింగ్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయనరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, నాయకులు మహిపాల్‌రెడ్డి, నరేందర్, ప్రకాష్, శోభారాణి, ఉప్పరి మల్లేశం పాల్గొన్నారు. అలాగే యాలాల మండలం జుంటుపల్లి, పగిడిపల్లి గ్రామాల్లో గ్రామ పంచాయతీ, ముకుందాపూర్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కో-ఆపరేటివ్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు సంగెంకుర్దు హన్మంతు, అక్బర్‌బాబా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా నిధుల స్వాహాపై విచారణ ముమ్మరం

- పాత ఏపీఎంలకు షోకాజ్ నోటీసులు జారీ



విచారణ చేస్తున్న డీపీఎంలు యాదయ్య, లలిత

యాచారం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌదర్‌పల్లిలో డ్వాక్రా పొదుపు సంఘాల్లో ఫోర్జరీ సంతకాలతో నిధులు డ్రా చేసిన ఘటనపై డీఆర్‌డీఏ ఉన్నతాధికారులు విచారణ ముమ్మరం చేశారు. ఇద్దరు డీపీఎంలు యాదయ్య, లలిత, ఆడిటర్లు శ్రీనివాస్, మధు పొదుపు సంఘాల రికార్డులను పరిశీలిస్తున్నారు. ఏయే నెలలో సంఘాలు ఎంత మేర అప్పులు చెల్లించారు, బకాయిలు ఎంత చెల్లించారు, బ్యాంక్‌లో రుణంతోపాటు పొదుపు డబ్బు జమ చేసిన రసీదులను పరిశీలిస్తున్నారు. నిబంధనల మేరకు నిధులు డ్రా చేశారా, లేదా అనే కోణంలో విచారణ చేస్తున్నామని డీఆర్‌డీఏ డీపీఎంలు యాదయ్య, లలిత తెలిపారు. సూక్ష్మ జీవనోపాధి ప్రణాళిక యాప్‌లో రుణం తీసుకునేందుకు అప్‌లోడ్ చేశారా, లేదా? అని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నేళ్ల నుంచి ఈ తతంగం జరుగుతుందని ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే నిధుల స్వాహాపై అధికారులు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఏపీఎంల పాత్ర ఉందా, లేదా? అని తెలుసుకునేందుకు అధికారులు విచారిస్తున్నారు. ఈ మేరకు పాత ఏపీఎంలైన సాంబశివుడు, సుదర్శన్‌రెడ్డి, సీసీ జంగయ్యలకు షోకాజ్ నోటీసలు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా బుక్‌కీపర్లను విధుల నుంచి తొలగించే అంశంపై యోచిస్తున్నట్లు తెలిసింది.

దోషులపై చర్యలు తీసుకుంటాం

పొదుపు సంఘాల్లో ఫోర్జరీ సంతకాలతో స్వాహా అయిన డబ్బును రికవరీ చేసి మహిళలను ఆదుకుంటామని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సంజయ్‌కుమార్ డ్వాక్రా సంఘాల మహిళలకు హామీ ఇచ్చారు. నిధుల స్వాహాపై సమగ్రంగా విచారణ చేస్తున్నామని తెలిపారు. ఈ ఘటనతో బ్యాంకుకు చెడ్డపేరు వచ్చిందని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయనవెంట బ్యాంక్ మేనేజర్ మాన్యానాయక్, సీఐ నందీశ్వర్‌రెడ్డి ఉన్నారు.



బినామీ ఉపాధ్యాయురాలిని నిలదీస్తున్న అధికారులు

ప్రభుత్వ పాఠశాలలో బినామీ ఉపాధ్యాయురాలి పాఠాలు

- విధులకు గైర్హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. అధికారుల తనిఖీతో వెలుగులోకి..

బొంరాస్‌పేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు విధులకు గైర్హాజరై, తన స్థానంలో బినామీ టీచర్‌తో తరగతులు నిర్వహిస్తున్న ఘటన వికారాబాద్ జిల్లాలో అధికారుల తనిఖీల్లో బయటపడింది. బొంరాస్‌పేట్ మండలం గాజులకుంట ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు విధుల్లో లేకపోవడంతో.. విద్యార్థులను అడగ్గా అసలు విషయం బయటపడింది. అదే గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ ఉపాధ్యాయురాలితో ప్రతిరోజూ పాఠాలు చెప్పిస్తూ.. ఆ ఉపాధ్యాయుడు తన వ్యక్తిగత పనులకు వెళ్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. దీంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆయనపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయంపై సదరు ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటేశ్‌ను వివరణ కోరగా.. అప్పటి వరకు పాఠశాలలోనే ఉన్నానని, శాఖాపరమైన పనుల నిమిత్తం మండల విద్యా కార్యాలయానికి వచ్చిన సమయంలోనే అధికారులు తనిఖీకి వచ్చినట్లు సమాధానం ఇచ్చాడు.

కల్వర్టు విస్తరణ పనులు చేపట్టాలి

ఆదిబట్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మంగల్‌పల్లి-సాహెబ్‌గూడ మధ్యలో పిరంగి కాల్వపై ఉన్న కల్వర్టు విస్తరణ పనులు చేపట్టాలని సీపీఎం మున్సిపల్ కన్వీనర్ తులసిగారి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో కల్వర్టు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పిరంగి కాల్వపై గతంలో నిర్మించిన కల్వర్టు పూర్తిగా పాడై ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. రోడ్డు విస్తరణ జరిగినప్పటికీ కల్వర్టు విస్తరణ మాత్రం జరగలేదన్నారు. కలెక్టరేట్ కొంగరకలాన్‌లో ఉండడంతో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల ప్రజలు ఈరోడ్డు మీదుగానే రాకపోకలు జరుపుతుంటారని, కల్వర్టుపై గుంతలు ఏర్పడడంతో రాత్రి సమయంలో కనబడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. గతంలో ఓ కారు అదుపు తప్పి కాల్వలో పడిపోవడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తుచేశారు. అధికారులు కల్వర్టు విస్తరణ చేపట్టి, గుంతలు పడిన రోడ్లుకు మరమ్మతులు చేయాలని కోరారు. నాయకులు జంగయ్య, బుగ్గరాములు, నరసింహ, జగన్, రంజిత్‌కుమార్, భిక్షపతి, ప్రభుదాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు గౌరవప్రదంగా మెలగాలి



మాట్లాడుతున్న ఎంఈవో మల్లయ్య

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 22(ఆంధ్యజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని, ఆ పదవికి మచ్చ తెచ్చేలా వ్యహరించకూడదని మండల విద్యాధికారి మల్లయ్య సూచించారు. విద్యార్థులను భవిష్యత్తులో మంచి స్థాయిలో స్థిరపడేలా కృషి చేయాలన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మహ్మద్ హిమన్షా గురువారం మద్యం తాగి పాఠశాలకు వచ్చిన తీరుపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. శుక్రవారం పాఠశాలకు వెళ్లి గ్రామస్థులతో కలిసి సదరు ఉపాధ్యాయుడితో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మరోసారి మద్యం సేవించి పాఠశాలకు వస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు హెచ్చరించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఇలా వ్యవహరించడం సరికాదని కుటుంబ సభ్యులకు సూచించారు. కాగా, మళ్లీ తాను మద్యం సేవించి పాఠశాలకు వస్తే తనపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి మల్లయ్యకు మహ్మద్ హిమన్షా లిఖితపూర్వకంగా లేఖను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ముదిగొండ రవియాదవ్, పలు యువజన సంఘాలకు చెందిన సభ్యులు ఉపాధ్యాయుడిని మందలించారు. మళ్లీ ఇలా వ్యవహరిస్తే భవిష్యత్తులో తీవ్రపరిణామలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

యురియా కొరతతో రైతుల ఇబ్బందులు

కందుకూరు/కొందుర్గు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): యురియా బస్తాల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో సాగుచేసిన వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయల పంటలకు కావాల్సిన్ని యురియా బస్తాలను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో అందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. 500 టన్నుల యురియా కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 120 టన్నులు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసింది. శుక్రవారం కేవలం 420బస్తాల యురియాను మండల కేంద్రానికి తరలించారు. దాంతో పలు గ్రామాల రైతులు యురియా కోసం మండల సహకార సంఘం కార్యాలయం వద్ద క్యూలో ఉన్నా.. సరిపడా యురియా బస్తాలు ఇవ్వలేవదని వాపోయారు. ప్రభుత్వం సరిపడా యురియా బస్తాలను సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని అన్నారు. కొందుర్గు మండల పరిధిలోని సింగిల్ విండో, రైతు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో మండల వ్యవసాయాధికారి సురేష్ రెడ్డి సమక్షంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు.

రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి గొప్ప సంఘ సంస్కర్త

షాద్‌నగర్ అర్బన్/కొందుర్గు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజిక మార్పు వచ్చి, పేదలు ఆర్థికంగా ఎదుగుతారని గ్రహించి, విద్యా సంస్థలను నెలకొల్పి కులమతాలకతీతంగా చదువుకునే అవకాశం కల్పించిన గొప్ప సంఘ సంస్కర్త రాజా బహదూర్ వెంకట్‌రాంరెడ్డి అని షాద్‌నగర్ రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు కొప్పుల మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వెంకట్‌రాంరెడ్డి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రెడ్డి భవన్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రెడ్డి సేవా సమితి నాయకులు గుర్రం రవీందర్‌రెడ్డి, ఎం.నర్సింహారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, బి.హరీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొందుర్గు మండలం రాంచంద్రాపూర్‌లో వెంకట్‌రాంరెడ్డి జయంతిని రెడ్డి సంఘం సభ్యులు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బల్వంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో బహుళ ప్రయోజనాలు

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- పనుల జాతర-2025 కార్యక్రమాలు ప్రారంభం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ ఇంకుడు గుంతను నిర్మిస్తే బహుళ ప్రయోజనాలను పొందుతారని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని అన్నారంలో శుక్రవారం చేపట్టిన పనుల జాతర-2025 కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గ్రామంలో స్వచ్ఛభారత్ మిషన్ నిధులతో నిర్మించిన నాలుగు సామూహిక ఇంకుడు గుంతలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులు లేని షాద్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికి ఇంకుడుగుంత, ప్రతీ గ్రామ మురుగునీటి నివారణ కోసం సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకుడుగుంతల నిర్మాణానికి అధికారులు చొరవ చూపాలని, గ్రామస్థులు సహకారం అందించాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్ ఖాన్, ఎంపీడీవో బన్సిలాల్, ఏడీఏ రమాదేవి, ఏవో నిశాంత్‌కుమార్, ఏఈ ప్రీతి, ఏపీవో అరుణరాణి, కాంగ్రెస్ నాయకులు జి. బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతి రెడ్డి, రఘునాయక్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌డి ఇబ్రహీం, ఎల్. రాములుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : ముకునూరు, రాయపోల్‌లో ఎంపీడీవో వెంకటమ్మ పనుల జాతర ప్రారంభించారు. ఎక్కువ రోజులు బాగా పనిచేసిన ఉపాధి కూలీలను సన్మానించారు. ఉపాధిహామీ నిధులతో నిర్మించుకున్న పశువుల షెడ్‌ను ప్రారంభించారు. రాయపోల్‌లో మొక్కలు నాటారు. ఏపీవో తిరుపతాచారి, సాంకేతిక సహాయకులు శ్రీనివాస్, తదితరులున్నారు.



షాద్‌నగర్ అర్బన్ : అన్నారంలో ఇంకుడు గుంతను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొందుర్గు : పనులు ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సులోచన

యాచారం : యాచారం, చౌదర్‌పల్లిలో ఎంపీడీవో రాధారాణి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డిలు పనుల జాతర కార్యక్రమాన్ని చేపట్టారు. మండల ప్రత్యేకాధికారి మాధవరావు తదితరులున్నారు.

చౌదరిగూడ/కొందుర్గు : ప్రతీ ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి, ఇంకుడుగుంతలు తప్పనిసరి నిర్మించుకోవాలని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన అన్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో లక్ష్మీ అనురాధ, ఎంపీవో హన్మంత్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, ఏఎంసీ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : ఇంకుడుగుంతలు భూ గర్భజలాల పెంపునకు దోహదపడుతాయని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మైసిగండిలో ఈజీఎస్ నిధులతో చేపట్టే ఇంకుడు గుంతల నిర్మాణానికి కార్యదర్శి జంగయ్య, మాజీ సర్పంచ్ తులసీరామ్ నాయక్‌లతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేశారు.

కొత్తూర్ : పనుల జాతరలో భాగంగా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను గ్రామ ప్రత్యేకాధికారులు ప్రారంభించారు. ఇంకుడు గుంతలు, మురుగు నీటి కాలువలు, ప్లాంటెషన్‌తో పాటు పలు అభివృద్ధి పనులకు అధికారులు శంకుస్థాపనలు చేశారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ అరుంధతి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, తదితరులున్నారు.

కందుకూరు : పనుల జాతర మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులను ప్రారంభం, శంకుస్థాపనలు చేశారు. ముచ్చర్లలో డీఆర్డీవో శ్రీలత, అడిషనల్ డీఆర్డీవో సుభాషిణి, ఎంఎస్‌వో సుధారాణి, ఎంపీడీవో సరితలు నూతనంగా నిర్మించిన ఫౌల్ట్రీ ఫాం షెడ్డును ప్రారంభించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో అధిక పని దినాలు చేసిన బండ అంజమ్మ, ముచ్చర్ల ఆండాలు, గ్రామంలో వనమహోత్సవం పనులను విజయవంతం చేసిన మాజీ సర్పంచ్ ఇ.రాంచంద్రారెడ్డిలను సన్మానించారు. నేదునూరులో ఎస్సీ బాలుర వసతి గృహం వద్ద రూ.98వేలతో చేపట్టనున్న ఇంకుడుగుంత పనులకు మాజీ వైఎస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, ఏవో లావణ్యలు శంకుస్థాపన చేశారు.



కందుకూరు : ముచ్చర్లలో నాటుకోళ్ల ఫాంను సందర్శించిన డీఆర్డీవో శ్రీలత, తదితరులు

నందిగామ : ఎంపీడీవో సుమతి మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ఇంకుడు గుంతలకు శంకుస్థాపన చేశారు. మండలంలో రూ.21.49లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. తహసీల్దార్ రాజేశ్వర్, ఏఈ క్రిష్ణారెడ్డి, తదితరులున్నారు.

కేశంపేట : మండల ప్రత్యేకాధికారి రమాదేవి పాపిరెడ్డిగూడ, సంగెంలో పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాపిరెడ్డిగూడలో కటికె హనుమంతు నిర్మించుకున్న పశువుల షెడ్డును ప్రారంభించారు. సంగెం గ్రామంలోని వెంచర్లలో ఉన్న 10శాతం భూమిలో డెన్స్ ప్లాంటేషన్‌కు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా అక్కడ మొక్కలు నాటారు.



కడ్తాల్ : మైసిగండిలో ఇంకుడుగుంత పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

ముగిసిన పనుల జాతర

(ఐదో పేజీ తరువాయి)

వీర్లపల్లి శంకర్ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, అదనపు పీడీ సుభాషిణి, జెడ్పీ డిప్యూటీ సీఈవో రంగారావు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ప్రత్యేకాధికారులు ఆయా మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రైతులు, ఉపాధిహామీ కూలీలు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధిహామీ పథకం, వాటర్‌షెడ్ పథకం, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, స్వచ్ఛభారత్ వంటి విభాగాల్లో చేపట్టిన, చేపట్టనున్న పనులకు ప్రారంభోత్సవాలు, భూమి పూజ చేశారు. నూతన గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, స్వచ్ఛ భారత్ మిషన్(గ్రామీణ) ద్వారా చేపట్టిన సెగ్రిగేషన్ షెడ్, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, ఇందిరా మహిళా శక్తి, ఉపాధి భరోసా కింద వ్యక్తిగత ఆస్తుల కల్పన పనులు.. పశువుల కొట్టం, కోళ్ల షెడ్, గొర్రెల షెడ్, పండ్ల తోటలు, వానపాములు ఎరువుల తయారీ, అజోలాపిట్ నిర్మాణం, జలనిధి కింద వాన నీటి సంరక్షణ-భూగర్భజలాలు పెంచే ఫారమ్‌పాండ్, ఊట కుంటలు వంటి అభివృద్ధి పనులు చేపట్టారు. ఉపాధిహామీ పథకంలో ఎక్కువ రోజులు పనిచేసిన కూలీలకు, దివ్యాంగులకు, పారిశుధ్య కార్మికులను, హరిత సంరక్షకులను సన్మానించారు.

ఆమనగల్లు తహసీల్దార్‌గా మహ్మద్ ఫహీమ్ ఖాద్రి

ఆమనగల్లు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండల తహసీల్దార్‌గా మహ్మద్ ఫహీమ్ ఖాద్రి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమనగల్లు తహసీల్దార్‌గా పనిచేసిన సీహెచ్ లలిత ఏసీబీకి పట్టుబడి సస్పెండ్ అయ్యారు. ఆమె స్థానంలో జిల్లా కేంద్రంలోని ఎస్‌డీసీలో సూపరిండెంట్‌గా పనిచేస్తున్న ఫహీమ్ ఖాద్రికి ఆమనగల్లుకు పోస్టింగ్ ఇచ్చారు. అదేవిధంగా తలకొండపల్లి తహసీల్దార్‌గా రమేశ్‌కు పోస్టింగ్ ఇచ్చారు. కాగా, గతంలో ఇక్కడ పనిచేసిన నాగార్జున ఏసీబీకి పట్టుబడి సస్పెండ్ అయ్యారు. ఆయన స్థానంలో కొందుర్గులో పని చేస్తున్న రమేశ్‌కు తలకొండపల్లికి పోస్టింగ్ ఇచ్చారు. ఏసీబీకి పట్టుబడిన ఇద్దరు తహసీల్దార్‌ల స్థానంలో కొత్తవారిని నియమించారు.

బాబోయ్.. భౌభౌ!

(ఐదో పేజీ తరువాయి)

చెబుతున్నాయి. 16,372 యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ చేశారు. ఏటేటా కుక్క కాటు ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. గత ఏడాది 3,998 మంది కుక్క కాటుకు గురికాగా, ఈ ఏడాది ఆ సంఖ్య 6,445కు చేరుకుంది. కుక్కకాటు ప్రమాదాలు వారం రోజుల నుంచి హెచ్చుమీరాయి. ఇబ్రహీంపట్నం పరిధిలోని కప్పపహాడ్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడిని పిచ్చికుక్క కరిచింది. అంతటితో ఆగకుండా ఇదే కుక్క మరో ముగ్గురిపై దాడి చేసింది. ఇదే గ్రామానికి చెందిన జంగిలి నరసింహ కొడుకు శశాంక్(4) ఇంటి ముం దు ఆడుకుంటుండగా పిచ్చికుక్క కరిచి గాయపరిచింది. బాలుడిని కాపాడటానికి వచ్చిన తాత యాదయ్యపై దాడి చేసింది. ఇదే కుక్క 8వ వార్డులో జంగిలి ప్రవళిక, ఏర్పుల మనోజ్‌కుమార్‌ను సైతం కరిచింది. బాలుడిని, యాదయ్యను ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

నియంత్రణ కరువు

గ్రామాలు, పట్టణాల్లో విచ్చలవిడిగా శునకాల గుంపులు కనిపిస్తున్నా వాటి నియంత్రణకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించడం లేదు. ప్రత్యేక నిధులు కేటాయించి పరిస్థితి చేయి దాటకుండా చక్కదిద్దడం లేదు. శునకాల నియంత్రణకు గతంలో పంచాయతీ, పురపాల పాలకవర్గ సమావేశాల్లో ప్రత్యేక నిధులు కేటాయించాలని తీర్మానించినా.. ఆ తరువాత చర్యలు లేవు. అయితే, ప్రస్తుతం పాలకవర్గాలు కూడా లేకపోవడంతో ఎవరికీ పట్టింపు లేదు.

రేబిస్ ఎందుకు వస్తుందంటే..

కుక్కకాటుకు గురైనప్పుడు దాని లాలాజలం ద్వారా వైరస్ మనుషులకు వ్యాప్తి చెందుతుంది. రేబిస్ సోకిన జంతువు ఏదైనా మనిషిని కరిస్తే ఈ వ్యాధి త్వరగా వ్యాప్తి చెంది ప్రాణానికి హాని కలిగిస్తుంది. రేబిస్ సోకిన కుక్క లాలాజలం ద్వారా మనిషి శరీరంలోకి ప్రవేశించి నాడీ వ్యవస్థను దెబ్బ తీసి కోమాలోకి వెళ్లి చివరకు ప్రాణాలు పోయే ప్రమాదముంది. రేబిస్ సోకిన వారికి నీళ్లను చూస్తే భయపడటం.. కాంతిని చూడలేకపోవడం, పక్షవాతం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. కుక్క, కోతి ఏదైనా కరిచినప్పుడు సబ్బుతో శుభ్రంగా కడగాలి.

అప్రమత్తతే ఆయుధం..

ప్రజలు నడుచుకుంటూ వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. కుక్కలపై రాళ్లు విసరడం, కర్రలతో కొట్టే ప్రయత్నాలు చేస్తే కుక్కలు బెదిరి ఎదురు దాడి చేసే ప్రమాదముందని చెబుతున్నారు. కుక్క దగ్గరకు వస్తుంటే పరుగెత్తకూడదని, అవి పోట్లాడుకునే సమయంలో వాటికి దూరంగా ఉండాలంటున్నారు. వాహనాలపై వెళ్తూ హారన్ మోగించొద్దని, కుక్కలు కరుస్తాయని వాహనాన్ని వేగంగా నడిపితే వెంటాడి కరిచే అవకాశముందని తెలిపారు.

డిసెంబర్ వరకు జర జాగ్రత్త

కుక్కల సంతతి ఉత్పత్తి అధికంగా జరిగే జూలై నుంచి డిసెంబరు వరకు జాగ్రత్తగా ఉండాలని పశు వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గర్భం దాల్చిన కుక్కలు ఎక్కువ కోపంతో ఉంటాయని, ఇలాంటి కుక్కలు తమను తరిమే ప్రయత్నం చేసేవారిపై దాడి చేస్తూ గాయపరుస్తుంటాయని తెలిపారు. గర్భధారణ ఎక్కువగా జరిగే ఆగస్టు- సెప్టెంబర్, ఫిబ్రవరి-మార్చి నెలల్లో కుక్కల జోలికి వెళ్లకూడదని స్పష్టం చేశారు.

మార్వాడీ గో బ్యాక్ బంద్ ప్రశాంతం

(ఐదో పేజీ తరువాయి)

మూసివేసి వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించారు. హైదరాబాద్ - శ్రీశైలం జాతీయరహదారిపై రాస్తారోకో నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేసి వినూత్న రీతిలో ఈ సందర్భంగా నిరసన తెలిపారు. అనంతరం వ్యాపారులు, వర్తక సంఘం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకన్నారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కడ్తాల వర్తక సంఘం అధ్యక్షుడు ఆసిఫ్‌అలీ, గౌరవాధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్, సంఘం నాయకులు వెంకటేశ్, రాజేందర్, గౌస్, చంద్రశేఖర్, శ్రీనాథ్, శ్రీకాంత్ రెడ్డి, కిరణ్, శ్రీనివాస్, భూపాల్, రాగవేందర్, రవి, శ్రీశైలం, పాండు, నాగేశ్, యూసూఫ్, శివ, లక్ష్మీనారాయణ, వీరేంద్ర, రాజు,యాదయ్య, చంద్రప్రకాశ్, సైదులు, రమేశ్, మల్లేశ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాలతోపాటు లాల్‌పహాడ్‌లో వ్యాపార సముదాయాలను స్వచ్ఛందంగా బంద్ పాటించారు. అనంతరం వారు మార్వాడీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఉమ్మడి మండల వ్యాపార సంఘం సభ్యులు పాల్గొన్నారు. మార్వాడీ వ్యాపారులకు వ్యతిరేకంగా ఇబ్రహీంపట్నంలో వర్తక వ్యాపారులు, పలు సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఉదయం నుండే బైక్ ర్యాలీ నిర్వహిస్తూ మార్వాడీ హటావో.. తెలంగాణకు బచావో అంటూ నినాదాలు చేశారు. ఈ బంద్‌కు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇందిరాల రమేష్, మడుపు వేణేగోపాల్‌రావులు నాయకత్వం వహించారు. మార్వాడి గోబ్యాక్ అంటూ కందుకూరు మండల కేంద్రంలో వ్యాపార సంఘాలు చేపట్టిన బంద్ విజయవంతమైయింది. అనంతరం హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై వ్యాపార సంఘాల నేతలు గుంద్ర అనిల్‌రెడ్డి, ఎస్.భూమిరెడ్డి, ప్రశాంత్‌చారి, ప్రకాశ్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు.



ఇబ్రహీంపట్నంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బంద్ మద్దతుదారులు

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

షాద్‌నగర్ అర్బన్/చౌదరిగూడ/కొందుర్గు/కేశంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చలో సచివాలయం పేరుతో ఇచ్చిన పిలుపు మేరకు బీజేపీ నాయకులను ముందస్తుగా శుక్రవారం అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. బీజేపీ షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడు కె.హరిభూషన్ పటేల్‌తో పాటు వంశీ కృష్ణ, జె. నర్సింహులు, జి.విజయ్, రాజేష్, తదితరులను అరెస్టుచేసి సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. హరిభూషన్ మాట్లాడుతూ ముందస్తు అరెస్టులేమిటని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ ప్రభుత్వ తీరునే అనుసరిస్తున్నదని విమర్శించారు. జీహెచ్‌ఎంసీలో నెలకొన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తలపెట్టిన సేవ్ హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం చట్ట విరుద్ధమని బీజేపీ కొందుర్గు మండ లాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, చౌదరిగూడ మాజీ ఉపసర్పంచ్ అనిల్‌కుమార్ అన్నారు. పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. అరెస్టయిన వారిలో నరేందర్, వేణుగోపాల్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు. అరెస్టులతో నిరసనలను ఆపలేరని బీజేపీ జిల్లా సంస్కృతిక శాఖ కో కన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ని రసన కార్యక్రమానికి వెళ్తుంటే తనతో పాటు యుగందర్, మల్లేష్, మహేష్‌ల తో పాటు మరికొందరు కార్యకర్తలను అరెస్ట్ చేశారని వివరించారు.

వైభవంగా బోనాలు



తలకొండపల్లి : పడకల్‌లో బోనాల ఊరేగింపు..

తలకొండపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పడకల్‌లో దుర్గమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎడ్ల బండ్లతో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సాయంత్రం మహిళలు బోనపు కుండలతో ఆలయానికి చేరుకొని నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. కాంగ్రెస్ మండలా ధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, జోగు రమేశ్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం పొందవచ్చునని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పోచమ్మ దేవాలయంలో చైర్మన్ సత్యం యాదవ్‌తో కలిసి పూజలు నిర్వహించారు. దేవాలయ అభివృద్ధి, భక్తులకు మౌలిక వసతుల కల్పనకు ఆయన రూ.51,116 విరాళం అందజేశారు.



చేవెళ్ల : పూజల్లో భక్తులు

ఆమనగల్లు : శెట్టిపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. గౌడ సంఘం నాయకులు బాలగోని పెద్ద నర్సింహ, ఆకు రాములు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అర్జున్‌రావు హాజరయ్యారు.

షాద్‌నగర్‌రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలం శేరిగూడలో మైసమ్మ బోనాలు జరుపుకున్నారు. ఊరేగింపులో గోవర్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శంకరయ్యగౌడ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. వైఎం తండాలో నూతనంగా నిర్మిస్తున్న లింగబసవేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ.1,01,116 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరుణ్‌రమేష్, ఎంపీపీటీసీలు డాకీ రామచంద్రనాయక్, మోది దర్శన్, నాయకులు దశరథ్‌నాయక్, జయేందర్‌రెడ్డి, రాములుగౌడ్, రాజు, శ్రీను, గోవిందునాయక్ తదితరులున్నారు.

చేవెళ్ల : శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయంలో కొలువైన భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి గాజులతో అలంకరణ చేశారు. భక్తులు ఆలయానికి ఉదయాన్నే విచ్చేసి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి 'కట్టమైసమ్మ' వార్షికోత్సవం

ఆమనగల్లు : పట్టణంలోని శ్రీకట్టమైసమ్మ దేవాలయం ప్రథమ వార్షిక వేడుకలకు ముస్తాబైంది. నేడు(శనివారం) వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మొక్తాల వెంకటయ్య తెలిపారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి హాజరవుతున్నట్లు చెప్పారు.

మంజూరైన యూరియాను వెంటనే ఇప్పించండి

షాద్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గానికి మంజూరైన యూరియా మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. శుక్రవారం సాయంత్రం సచివాలయంలో ఆయన మంత్రిని కలిసి షాద్‌నగర్ నియోజకవర్గానికి 1,271 బస్తాల యూరియా కేటాయిస్తే.. ఇప్పటి వరకు కేవలం 6,750 బస్తాల యూరియాను మాత్రమే సరఫరా చేశారని మంత్రికి వివరించారు. నియోజకవర్గ పరిధిలోని చౌదరిగూడ మండలానికి వ్యవసాయ మార్కెట్ యార్డును మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో నియోజకవర్గానికి మంజూరైన యూరియా వెంటనే సరఫరా చేస్తామని, మార్కెట్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి తెలిపారు.

షోయబుల్లాఖాన్‌కు ఘన నివాళి

జర్నలిస్టు షోయబుల్లాఖాన్‌ను జర్నలిస్టులు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. శుక్రవారం టీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణ ప్రధాన కూడలిలో షోయబుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ గిరిజన రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్, మాజీ జడ్పీటీసీలు వెంకట్‌రాంరెడ్డి, విశాలశ్రావణ్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబార్‌ఖాన్, తిరుపతిరెడ్డి, బాలరాజుగౌడ్ ఉన్నారు.

కళాకారులను ప్రోత్సహిస్తాం

అంతరించి పోతున్న కళలను కాపాడుకునేందుకు కళాకారులను ప్రోత్సహిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఓ మొబైల్ ఫోన్ షాప్‌లో ఏర్పాటుఏర్పాటు చేసిన కేపీ మ్యూజిక్ లోగోను ఆయన ఆవిష్కరించారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఖాజా నటించిన సినిమా పాటలను ఆయన ఆవిష్కరించారు.

ఆలయ అభివృద్ధికి ముందుకు రావాలి

షాద్‌నగర్ రూరల్ : ఎలికట్ట భవానీ మాత ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట శివారులోని మహల్ ఎలికట్టలో ఉన్న భవానీ మాత ఆలయ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 50 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కాగా, కొత్తూరు మాజీ జడ్పీటీసీ శ్యామ్‌సుందర్‌రెడ్డి రూ.5 లక్షలు, కొందుర్గు సింగిల్ విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి రూ.2 లక్షలు, ఇతర దాతలు మొత్తం రూ.21 లక్షలు ప్రకటించారు. వారిని ఎమ్మెల్యే సన్మానించారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ కు దీటుగా తీర్చిదిద్ది రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ అన్నారు. రేఖ్యతండాకు చెందిన నేనావత్ రమేశ్ నాయక్‌కు ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన రూ.35వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శుక్రవారం మండల కేంద్రంలో బాధిత కుటుంబానికి రాజేశ్ అందజేశారు.

కందుకూరు : మండల వర్తక, వ్యాపార సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండ్ర అనిల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కె.ప్రవీణ్‌గుప్త, సామ దయాకర్‌రెడ్డి, తల్లోజు భరత్‌చారి, ఇంద్రాసేనారెడ్డి, భూమిరెడ్డి, సాధ నాగేశ్వర్‌రెడ్డి, సామ ప్రకాశ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, పులి సత్తయ్య, సురసాని లక్ష్మారెడ్డి, టంకరి లక్ష్మారెడ్డి, ప్రశాంత్‌చారిలతో పాటు మరికొందరిని ఎన్నుకున్నారు.

క్రైం కార్నర్

తప్పిపోయిన బాలుడు

- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

యాచారం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): యాచారంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల వసతి గృహం నుంచి తప్పిపోయిన బాలుడి ఆచూకీ తెలుసుకొని తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కందుకూరు మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మణిచరణ్(10) యాచారం మండలంలోని సాఘిక సంక్షేమశాఖ గురుకుల బాలుర హాస్టల్‌లో ఉంటూ ఆరో తరగతి చదువుతున్నాడు. ఈక్రమంలో యాచారం బస్టాండ్‌లో శుక్రవారం ఏడుస్తూ పోలీసులకు కనిపించాడు. దాంతో వారు వెంటనే స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ చేశారు. ఈమేరకు తనది మాదాపూర్ గ్రామమని, సోషల్‌వెల్‌ఫేర్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నట్లు తెలిపాడు. పోలీసులు సమాచారం సేకరించి తల్లిదండ్రులకు అప్పగించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కొత్తూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి హైదరాబాద్‌కు కంటైనర్ లారీలో అక్రమంగా తరలిస్తున్న పశువులను శుక్రవారం గోసంరక్షణ సమితి నాయకులు అడ్డుకున్నారు. లారీలో పశువులను తరలిస్తున్న విషయాన్ని గమనించిన స్థానిక గోసంరక్షణ సమితి నాయకులతో పాటు, బీజేపీ నాయకులు స్థానిక బైపాస్ రోడ్డులోని పెంజర్ల చౌరస్తా వద్ద లారీని అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. లారీలో చెక్కలు వేసి పైన, కింద పశువులను తరలిస్తున్నారు. పోలీసులు లారీ డ్రైవర్‌తో పాటు, లారీని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీలో 94పశువులు ఉండగా, 8 పశువులు మృత్యువాతపడ్డాయి. మిగతా పశువులను హైదరాబాద్‌లోని జియాగూడలో ఉన్న గోశాలకు తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేకుండా డీజే నిర్వహిస్తున్న వారిపై కేసు

తలకొండపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం రాత్రి సమయంలో నిబంధనలకు విరుద్ధంగా డీజేలు నడిపిన ముగ్గురిపై కేసు నమోదు చేసి సౌండ్ బాక్సులను సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. చుక్కాపూర్ గ్రామానికి చెందిన డీజే యజమాని కడారి కుమార్, తలకొండపల్లి గ్రామానికి చెందిన మార్చ మహేశ్, దేవుని పడకల్ గ్రామానికి చెందిన పులిజాల నవీన్‌పై కేసు నమోదు చేశారు.

'సైబర్‌క్రైమ్'లో పోగొట్టుకున్న డబ్బులు రికవరీ

- బాధితుడి అకౌంట్‌లో జమ చేసిన పోలీసులు

కేశంపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్‌లో భాగంగా పోగొట్టుకున్న డబ్బులను రికవరీ చేసిన పోలీసులు కోర్టు ఉత్తర్వుల మేరకు శుక్రవారం బాధితుడి అకౌంట్లో జమచేశారు. మండల పరిధిలోని బొదునంపల్లికి చెందిన కోసిరెడ్డి కృష్ణారెడ్డి జనవరి 23న ఆరంఘర్ నుంచి నిర్ధవెల్లి మార్గంలో వెళ్లే ఆర్టీసీ బస్సులో ప్రయాణించాడు. మార్గమధ్యలో జేబులో నుంచి సెల్‌ఫోన్ పడిపోయింది. దాంతో ఫోన్ ద్వారా తన బ్యాంకు అకౌంట్లో ఉన్న రూ.1,45,000 కూడా ఎవరో సొమ్ముచేసుకున్నాడని బాధితుడు గుర్తించాడు. డయల్ 1930కు ఫిర్యాదు చేసి కేశంపేట పోలీసులను సంప్రదించాడు. ఈమేరకు పోగొట్టుకున్న డబ్బులను రికవరీ చేసిన పోలీసులు కోర్టు ఉత్తర్వుల ద్వారా బ్యాంకు నుంచి తిరిగి రూ. 87,000లను బాధితుడి అకౌంట్లో శుక్రవారం జమ చేయించినట్లు సీఐ నరహరి తెలిపారు. ఆయనతో ఎస్ఐ రాజ్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

మహిళల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట

(ఐదో పేజీ తరువాయి)

రుణాలు అందించి కేంద్రం ప్రోత్సహిస్తుందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 33 శాతం మహిళలకు ఎమ్మెల్యేల సీట్లు ఇస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం చిన్నారుల కోసం సుకన్యా సమృద్ధి యోజన పథకం అందిస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు చేయూతనిస్తుందన్నారు. పేదలకు ప్రతీనెల రేషన్ బియ్యం, వంటగ్యాస్, ఇళ్లు ఇస్తుందన్నారు. నారీశక్తితోనే తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారం వస్తుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మహిళలను అన్నివిధాల మోసం చేసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి కావ్య, జిల్లా నాయకులు తూళ్ల వీరేందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, సామ రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, జయశంకర్‌గౌడ్, చేవెళ్ల మండల అధ్యక్షుడు శ్రీకాంత్, చేవెళ్ల మున్సిపాల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణాగౌడ్, చేవెళ్ల మండల మహిళ నాయకురాలు డాక్టర్ మల్గారి వ్యూహరెడ్డి, మండల నాయకులు అంజనేయులుగౌడ్, శేఖర్, దేవుని శర్వలింగం, శ్రీనివాస్, ఆంజనేయులు, కృష్ణ, మల్లారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు తదితరులు ఉన్నారు.

పంటల పరిశీలన

అనంతరం ఖానాపూర్ గ్రామంలోని పత్తి పంటను రాంచందర్‌రావు పరిశీలించారు. పంటల గిట్టుబాటు ధరల గురించి రైతు శశివర్ధన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులు సామ రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిల డ్రాగన్ పంట గురించి ఆరా తీశారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధర తగ్గిందని వారు వాపోయారు. రైతులను మోదీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

మార్కెట్ దుకాణాల అద్దెకు సెప్టెంబరు 3న ఈ-వేలం

ఆమనగల్లు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఎదుట, లోపల నిర్మించిన 8 దుకాణాల అద్దెకు వేలం నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ తెలిపారు. కమర్షియల్ దుకాణాలను నెలసరి అద్దె ప్రాతిపదికన ఎస్సీ -1, ఎస్టీ-1, బీసీ- 2, జనరల్ కేటగిరీకి-4 కేటాయించినట్లు తెలిపారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం గీత మాట్లాడుతూ ఈ-వేలం ద్వారా దుకాణాలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో రూ.2 వేల రుసుము చెల్లించి ఈనెల 25 నుంచి 31వరకు దరఖాస్తు ఫారాలు పొందవచ్చునని తెలిపారు. రూ.లక్ష డీడీ మార్కెట్ కార్యదర్శి ఆమనగల్లు పేరిట సెప్టెంబరు 1వ తేదీ వరకు సమర్పించాలన్నారు. సెప్టెంబరు 3న ఉదయం 11గంటలకు మార్కెట్ కార్యాలయంలో ఆన్‌లైన్ వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

కొందుర్గు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాపార్క్ వద్ద నేడు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల మహాధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధర్నాకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఉపాధ్యాయులు సుధాకర్, నరసింహ, జంగయ్య, రామకృష్ణ, శ్రీదేవి, హేమలత, రజిని, శశికళ పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ విజయ్‌నగర్ కాలనీలోని బ్రహ్మకుమారీస్ భవనంలో నేడు(శనివారం) ఉదయం 10గంటలకు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బ్రహ్మకుమారి శోభ తెలిపారు. రాజయోగిని ప్రకాశమణి 18వ పుణ్యస్మృతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శిబిరానికి రక్తదాతలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

దాతల సహకారం మరువలేనిది

కేశంపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పురోగతికి సహకారం అందిస్తున్న దాత సేవలు మరువలేనివని ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ అన్నారు. చింతకుంటపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బీఆర్ఎస్ యువ నాయకుడు పోచమోని రమేష్‌యాదవ్ శుక్రవారం స్కూల్‌బ్యాగ్‌లు అందించారు. ఉపాధ్యాయులు తదితరులున్నారు.

స్కూల్ బ్యాగ్‌లు అందించిన రమేష్ యాదవ్

